TGTEL/26/A6780

# స్పందన

తెలుగు దినపత్రిక

సంపుటి :01 | సంచిక :27 | పేజీలు 8 వెల : 5 | సోమవారం 12 అక్టోబర్ 2026

విలేకరులు కావలెను

జర్నలిస్టులే యాజమాన్యంగా నడపబడుతూ
ప్రజా గొంతుకై అనతికాలంలోనే ప్రభంజనం సృష్టిస్తున్న
స్పందన దినపత్రికలో పనిచేయుటకు విలేకరులు కావలెను.
అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి ఉన్న వార
ఈ క్రింది నెంబర్లలలో సంప్రదించండి
9440657806,9440697806

# సీఈసీ అండతో పేదల ఓట్లు తొలగిస్తున్నారు

- గోవా బహిరంగ సభలో మోదీ సర్కారుపై సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజం
- సీఎం ప్రమోద్ రాష్ట్రాన్ని డ్రగ్స్, భూ మాఫియాకు అడ్డాగా మార్చారని ధ్వజం
- వచ్చే ఎన్నికల్లో గోవాలో కాంగ్రెస్ విజయం తథ్యమని ధీమా

హైదరాబాద్: మోదీ ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకుని పేదల ఓట్లు తొలగిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. గోవా ప్రజలు రెండుసార్లు భాజపాకు ఓటు వేసి గెలిపించారని, మూడోసారి అదే తప్పు చేయొద్దని సూచించారు. చిన్న చిన్న పార్టీలు, స్వతంత్రులకు ఓటు వేస్తే వారు చివరికి భాజపాకే మద్దతిస్తారని, కాంగ్రెస్‌కు మెజారిటీ ఇస్తే సంక్షేమ పాలన అందుతుందన్నారు. గోవాలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అక్కడి కాంగ్రెస్ ఆధ్వర్యంలో గత నెల 22న "గోయ్ రాఖోన్న్" పేరుతో పాదయాత్ర మొదలైంది. గోవాలో భూములు, పర్యావరణం, సంస్కృతి, వారసత్వం, స్థానిక గుర్తింపును కాపాడుకోవాలనే నినాదంతో ప్రారంభమైన యాత్ర 27 రోజులపాటు 40 నియోజకవర్గాల మీదుగా సాగుతోంది. ఆదివారం పాదయాత్రలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి అక్కడి చీఫ్టైన్స్ స్మారకం నుంచి కున్కోలిమ్ బస్టాండు వరకు

-2వ పేజీలో



ఏటా జూన్ ఆరంభంలో రుతుపవనాలు తొలుత కేరళంకు వస్తాయి. తరవాత నాలుగైదు రోజులకు గోవాకు వస్తాయి. 2026 ఎన్నికల్లో కేరళంలో కాంగ్రెస్ గెలిచింది. రుతుపవనాల మాదిరిగానే ఇప్పుడు గోవాలోనూ కాంగ్రెస్ పవనాలు వీస్తున్నాయి. గోవాలో కాంగ్రెస్ గెలిచిన తరవాత రెండుసార్లు కేంద్రంలో హస్తం పార్టీ అధికారంలోకి వచ్చింది. ఈసారీ అదే పునరావృతమవబోతోంది. గోవా సభలో సీఎం రేవంత్‌రెడ్డి



# మోదీ ప్రభుత్వం అత్యుత్తమ పాలన అందిస్తోంది

- కొనియాడిన భాజపా రాష్ట్ర ప్రజాప్రతినిధులు
- 25 సంవత్సరాల ప్రజా పరిపాలనను అభినందిస్తూ తీర్మానం
- పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సహా ముఖ్య నేతలు

హైదరాబాద్: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం 'నాగరిక్ దేవో భవ' అనే మార్గదర్శక సూత్రాన్ని అనుసరిస్తూ ప్రజలకు అత్యుత్తమ పాలనను అందిస్తోందని భాజపా రాష్ట్ర ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. మోదీ విజయవంతంగా 25 సంవత్సరాల ప్రజా పరిపాలనను(సీఎంగా, పీఎంగా) పూర్తిచేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం హైదరాబాద్‌లోని భాజపా కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు అధ్యక్షతన పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు ముఖ్య నేతలు సమావేశమయ్యారు. మోదీ పాలనను అభినందిస్తూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీర్మానం ప్రవేశపెట్టగా రామచందర్‌రావు బలపరిచారు. "కేంద్ర ప్రభుత్వ సమగ్రాభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా తెలంగాణ రాష్ట్రం విశేషంగా లబ్ధి పొందింది. రాష్ట్రంలోని పలు కీలక అభివృద్ధి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలకు కేంద్రం రూ.13 లక్షల కోట్లకుపైగా నిధులు సమకూర్చింది. 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సేవా కార్యక్రమాలు ప్రశంసనీయం" అని సమావేశం కొనియాడింది. సమావేశానికి ఎంపీలు కె.లక్ష్మణ్, డీకే అరుణ, ఈటల రాజేందర్, భాజపా శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పార్టీ మండలి పక్ష నేత ఏవీఎన్ రెడ్డి, పార్టీ రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి మధుకర్, రాష్ట్ర సహ ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్ తదితరులు హాజరయ్యారు. సమావేశంలో రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలపై నేతలు చర్చించినట్లు సమాచారం.



# 200 కోట్లతో యంగ్ ఇండియా పాఠశాల

వచ్చే విద్యా సంవత్సరం జూన్ నాటికి పాన్నెకల్ వద్ద నిర్మిస్తున్న యంగ్ ఇండియా సమీకృత నివాస పాఠశాలను అందుబాటులోకి తీసుకురావా లని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం ఖమ్మం జిల్లా పాన్నెకల్ వద్ద సుమారు రూ.200 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న పాఠశాల భవన సముదాయాన్ని జిల్లా కలెక్టర్ దివాకరతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ ప్రాంగణమంతా కలియతిరుగుతూ వివిధ విభాగాల్లో జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. సంబంధిత అధికారులు నిర్మాణ వివరాలు, ప్రస్తుత స్థితిగతులను వివరించగా, పనుల వేగం, నాణ్యత, మిగిలిన నిర్మాణాల గురించి మంత్రి ఆరా తీశారు. నిర్ణీత గడువులోగా అన్ని పనులు పూర్తిచేసి విద్యార్థులకు పాఠశాలను అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.

- జూన్ నాటికి సమీకృత పాఠశాల అందుబాటులోకి రావాలి
- పాన్నెకల్ పాఠశాల పనులను పరిశీలించిన పొంగులేటి
- నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశం
- పేదలకు కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే లక్ష్యం

ఖమ్మం, అక్టోబర్ 11 :

పాఠశాల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు. భవన సముదాయంలోని వివిధ విభాగాల నిర్మాణ పురోగతిని పరిశీలించిన ఆయన, పనుల నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే, నిర్దేశిత గడువులోగా నిర్మాణం పూర్తికావాలంటే సంబంధిత శాఖల అధికారులు, నిర్మాణ (మిగతా 2వ పేజీలో)

# శంషాబాద్‌లో ఇండిగో విమానం అత్యవసర ల్యాండింగ్



- ప్రయాణికుడి పవర్ బ్యాంక్‌లో మంటలు
- ఢిల్లీ నుంచి చెన్నై వెళ్తుండగా ఘటన
- అప్రమత్తమైన విమాన సిబ్బంది
- హైదరాబాద్‌కు మళ్లించినట్లు సమాచారం

శంషాబాద్, అక్టోబర్ 11 :

ఢిల్లీ నుంచి చెన్నైకి వెళ్తున్న ఇండిగో విమానంలో ప్రయాణికుడికి చెందిన పవర్ బ్యాంక్‌లో మంటలు చెలరేగడంతో విమానాన్ని శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసరంగా దించినట్లు సమాచారం. ఇండిగోకు చెందిన 6ఈ6115 విమానం ప్రయాణిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. విమానంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ప్రయాణికులు ఆందోళనకు గురైనట్లు సమాచారం. పరిస్థితిని గుర్తించిన విమాన సిబ్బంది అప్రమత్తమై తగిన చర్యలు (మిగతా 2వ పేజీలో)



# జనగామ జిల్లా జోలికొస్తే ఖబడ్దార్!

- జిల్లా అభివృద్ధిపై ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు
- కేసీఆర్ హయాంలోనే జనగామకు కీలక సంస్థలు
- సాగునీరు, విద్యుత్తు అందించి రైతులను ఆదుకోవాలి
- హామీలు అమలు చేయకపోతే ప్రజలే బుద్ధి చెబుతారు

2

# ఆఫ్రికా తీరంలో పడవ బోల్తా 109 మంది మృతి

- మృతుల్లో 15 మంది చిన్నారులు
- మరో 116 మందికి పైగా గల్లంతు
- గల్లంతైన వారి కోసం ముమ్మరంగా గాలింపు

జిబౌటి, అక్టోబర్ 11 : మెరుగైన భవిష్యత్తు కోసం విదేశాలకు వలస వెళుతున్న వారి జీవితాలు సముద్రంలో విషాదాంత మయ్యాయి. ఆఫ్రికా తీరంలో వలసదారులతో ప్రయాణిస్తున్న పడవ బోల్తా పడిన ఘటనలో 109 మంది ప్రాణాలు కోల్పోయా రు. మృతుల్లో 15 మంది చిన్నారులు ఉండటం తీవ్ర విషాదాన్ని నింపింది. (మిగతా 2వ పేజీలో)



# ఫామ్‌ల్యాండ్ల రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంపై హన్మంతప్ప ఆగ్రహం

**-కమిషన్లు ఇవ్వలేక ఫామ్‌ల్యాండ్లకు తాళాలు**

**-రిజిస్ట్రేషన్లు వెంటనే ప్రారంభించాలని డిమాండ్**

**-మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బిడెకన్నె హన్మంతప్ప**



నారాయణఖేడ్,అక్టోబర్11(స్పందన)

నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఫామ్‌ల్యాండ్ల రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంతో యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బిడెకన్నె హన్మంతప్ప అన్నారు. అధికార పార్టీ నాయకులు అధిక మొత్తంలో కమిషన్లు డిమాండ్ చేస్తున్నారంటూ ఆరోపించారు. అడిగినంత కమీషన్ ఇవ్వలేక, రిజిస్ట్రేషన్లు చేసుకోలేక ఫామ్‌ల్యాండ్ల యజమానులు వాటికి తాళాలు వేసి ఇళ్లకు వెళ్తున్నారని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

సుమారు 15 ఏళ్ల క్రితం నారాయణఖేడ్ ప్రాంతంలో భూముల కొనుగోళ్లు, అమ్మకాలు, ఇతరులకు భూములు కొనిపించే కార్యకలాపాలు ప్రారంభించాయని తెలిపారు. ఫామ్‌ల్యాండ్ల ఏర్పాటు వల్ల ఒకప్పుడు ఎకరం రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఉన్న భూముల ధరలు ప్రస్తుతం రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు చేరాయని పేర్కొన్నారు. ఫామ్‌ల్యాండ్ల యజమానులు రోడ్లు వేయడం, బోర్లు తవ్వించడం, మొక్కలు పెంచడం ద్వారా గ్రామాలు, తండాల అభివృద్ధికి దోహదపడ్డారని అన్నారు. ఒక ఫామ్‌ల్యాండ్ ఏర్పాటు ద్వారా వ్యవసాయ కూలీలు, వాచ్‌మెన్లు, జేసీబీ, ట్రాక్టర్ డ్రైవర్లు, పెట్రోల్ బంకులు, దాబాలు, హోటళ్లు, కిరాణా దుకాణాలు తదితర రంగాలకు చెందిన సుమారు 40 రకాల వృత్తుల వారు ఉపాధి పొందుతున్నారని వివరించారు. రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంతో వీరిపై ఆధారపడిన పేద కుటుంబాల జీవనోపాధి దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గుంటల చొప్పున భూముల రిజిస్ట్రేషన్లకు భూ భారతిలో అవకాశం కల్పించినప్పుడు వాటిని నిలిపివేయడం ఏమిటని ప్రశ్నించారు. స్లాట్ పేరుతో చలానాలు కట్టించుకున్న ప్రభుత్వం, రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని అధికారులకు ఎవరు ఆదేశాలు ఇచ్చారని నిలదీశారు. ఎకరానికి లక్ష రూపాయలు డిమాండ్ చేస్తున్నారంటూ ఆరోపించిన ఆయన, రిజిస్ట్రేషన్లు ఆపాలని చెప్పిన వారి పేర్లను రెవెన్యూ అధికారులు వెల్లడించాలని డిమాండ్ చేశారు.వివాదాలు, అసైన్డ్ భూములు, కోర్టు కేసులు లేదా ఫిర్యాదులు

ఉన్న భూముల రిజిస్ట్రేషన్లను నిలిపివేయడంలో అభ్యంతరం లేదని, అన్ని పత్రాలు సక్రమంగా ఉన్న భూముల రిజిస్ట్రేషన్లను నిలిపివేయడం సరికాదన్నారు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి కూడా నష్టం వాటిల్లే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఫామ్‌ల్యాండ్ల రిజిస్ట్రేషన్లను వెంటనే పునరుద్ధరించాలని, లేనిపక్షంలో రాష్ట్రంలోని ఫామ్‌ల్యాండ్ల యజమానులతో కలిసి రాష్ట్రవ్యాప్త ఆందోళన చేపడతామని హన్మంతప్ప హెచ్చరించారు.

# పశువైద్యశాలలో ఖాళీ కుర్చీ దర్శనం.. వైద్యం అందక పశువుల అవస్థలు

**శాశ్వత వెటర్నరీ డాక్టర్‌ను నియమించాలని రైతుల డిమాండ్.**



కోహీర్ అక్టోబర్ 11 (స్పందన)

కోహీర్ మండల కేంద్రంలోని పశువైద్యశాలలో పశువైద్యుడు అందుబాటులో లేకపోవడంతో మూగజీవులకు సకాలంలో వైద్యం అందడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.పశు వైద్యశాలకు వెళ్లినప్పుడు వైద్యుడి కుర్చీ ఖాళీగా దర్శనమిస్తోందని,అత్యవసర సమయాల్లో పశువులకు చికిత్స అందక పశుపోషకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పశువులకు అనారోగ్యం కలిగినప్పుడు సకాలంలో వైద్యం అందకపోవడంతో కొన్ని పశువులు మృత్యువాత పడుతున్నాయని పశువుల యజమాన్యం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశువుల మరణాలతో తమకు ఆర్థికంగా నష్టం వాటిల్లుతోందని వాపోతున్నారు. పశువులపై ఆధారపడి జీవనం సాగించే రైతులకు వైద్యసేవలు అందుబాటులో లేకపోవడం తీవ్ర సమస్యగా మారిందని పేర్కొంటున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కోహీర్ పశువైద్యశాలకు శాశ్వత వెటర్నరీ డాక్టర్‌ను నియమించాలని, పశువులకు నిరంతరం వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు, పశువుల యజమాన్యం కోరుతున్నారు.

# సీఈసీ అండతో పేదల ఓట్లు తొలగిస్తున్నారు

అక్కడి నేతలతో కలిసి నడిచారు. పాదయాత్రలో, అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. గోవాలో ప్రస్తుత భాజపా పాలనలో డ్రగ్స్ ముఠాలు, భూ మాఫియాలు రాజ్యమేలుతున్నాయని ఆరోపించారు.

**ఎస్సీ, ఎస్టీ, బీసీల ఓట్ల తొలగింపే లక్ష్యంగా మోదీ అడుగులు**

"దేశంలో ప్రస్తుతం పేదలు, ధనవంతులు అనే రెండు రకాల ప్రజలున్నారు. మోదీ ప్రభుత్వం సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను అడ్డుపెట్టుకుని పేదలు, ఎస్సీ, ఎస్టీ, బీసీల ఓట్లను తొలగిస్తోంది. రాహుల్‌గాంధీ ఓట్ల తొలగింపుపై దిల్లీలో పోరాడుతున్నారు. అందుకే రాహుల్‌గాంధీ ప్రతినిధిగా నేను గోవా సభకు వచ్చా. ఇక్కడి పాదయాత్రకు ప్రజల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే.. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు అక్కడ నేను చేసిన పాదయాత్ర గుర్తుకొస్తోంది. గోవాకు మంచిరోజులు రాబోతున్నాయని అర్థమవుతోంది" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మాణిక్‌రావ్ ఠాక్రే రెండేళ్లపాటు శ్రమించి తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషిచేశారని, ఇప్పుడు గోవాలోనూ శ్రమిస్తున్నారని కొనియాడారు.

# చెన్నైలో మెట్రో సేవలు ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

రావడంతో ఈ ప్రాంతాల మధ్య ప్రయాణించే ప్రజలకు ప్రత్యామ్నాయ రవాణా సదుపాయం కలగనుంది. ముఖ్యంగా రహదారులపై వాహనాల రద్దీని తగ్గించేందుకు మెట్రో సేవలు దోహదపడే అవకాశం ఉంది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జెండా ఊపి మెట్రో రైలు సేవలను ప్రారంభించారు. గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్, ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కొత్త మార్గంలో రైళ్ల రాకపోకలకు అధికారికంగా శ్రీకారం చుట్టడంతో రెండో దశ విస్తరణలో మరో కీలక భాగం ప్రజలకు అందుబాటులోకి వచ్చినట్లయింది. నగర రవాణా వ్యవస్థలో మెట్రో సేవల పాత్ర పెరుగుతున్న నేపథ్యంలో ఈ మార్గం ప్రారంభం ప్రాధాన్యం సంతరించుకుంది. కొత్త స్టేషన్ల ద్వారా సమీప ప్రాంతాల ప్రజలు మెట్రో సేవలను వినియోగించుకునే అవకాశం ఏర్పడింది. ప్రారంభోత్సవం అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్‌తో కలిసి మెట్రో రైలులో ప్రయాణించారు. ఈ సందర్భంగా కొత్త మార్గంలోని రవాణా సదుపాయాలను పరిశీలించారు. మెట్రో రైలు సేవలు ప్రారంభం కావడంతో నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ప్రయాణ సమయం తగ్గే అవకాశం ఉంది. అయితే ప్రయాణ సమయంపై ప్రభావం, ప్రయాణికుల రద్దీ, ఇతర రవాణా మార్గాలతో అనుసంధానం వంటి అంశాలు సేవల వినియోగం పెరిగేకొద్దీ మరింత స్పష్టమవుతాయి. మెట్రో సేవలను సురక్షితంగా, సమర్థంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేశారు. చెన్నై మెట్రో రైలు ప్రాజెక్టు రెండో దశ నగర రవాణా మౌలిక సదుపాయాల విస్తరణలో భాగంగా చేపట్టబడుతోంది. ఇందులో నాలుగో మార్గానికి చెందిన తొలి భాగాన్ని ప్రారంభించడం ద్వారా పూవిరుందవల్లి బైపాస్ నుంచి వడపళని వరకు కొత్త ప్రయాణ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. 11 ఎత్తైన స్టేషన్లతో కూడిన ఈ మార్గం స్థానిక ప్రజల రవాణా అవసరాలను తీర్చడంలో ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

# జనగామ జిల్లా జోలికొస్తే ఖబడ్దార్!

**జిల్లా అభివృద్ధిపై ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు**

**కేసీఆర్ హయాంలోనే జనగామకు కీలక సంస్థలు**

**సాగునీరు, విద్యుత్తు అందించి రైతులను ఆదుకోవాలి**

**హామీలు అమలు చేయకపోతే ప్రజలే బుద్ధి చెబుతారు**

జనగామ, అక్టోబర్ 11 :

జనగామ జిల్లా అభివృద్ధి, జిల్లా అస్తిత్వం విషయంలో ఎవరైనా జోక్యం చేసుకుంటే సహించేది లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. జనగామ జిల్లా ఆవిర్భవించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన దశాబ్ది సభలో ఆయన మాట్లాడారు. జిల్లా ఏర్పాటులో ప్రజల పోరాటం కీలక పాత్ర పోషించిందని, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం జనగామ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చిందని పేర్కొన్నారు. జిల్లాకు సంబంధించిన అంశాలపై మాట్లాడే ముందు గతంలో నాయకులు చేసిన కృషిని గుర్తించాలని అన్నారు. జనగామ జిల్లా అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పనులను ప్రజలు మరచిపోరని వ్యాఖ్యానించారు. జిల్లా ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే జనగామలో సమీకృత కలెక్టరేట్, వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాల, ఆసుపత్రులు వంటి కీలక సంస్థలు అందుబాటులోకి వచ్చాయని పల్లా రాజేశ్వర్‌రెడ్డి వివరించారు. జిల్లా ఏర్పాటుతో పరిపాలనా సౌలభ్యం పెరగడంతోపాటు స్థానికంగా ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. జనగామ అభివృద్ధి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, చేపట్టిన కార్యక్రమాలు జిల్లాకు ప్రయోజనం చేకూర్చాయని తెలిపారు. జిల్లాకు సంబంధించిన అభివృద్ధి అంశాలపై రాజకీయాలకు అతీతంగా చర్చ జరగాలని, ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. గతంలో జిల్లా ఏర్పాటు కోసం ప్రజలు చేసిన ఉద్యమాలను గుర్తుచేస్తూ, వారి ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కొనసాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు సాగునీరు, విద్యుత్తు సమస్యలను ఎదుర్కొంటున్నారని విమర్శించారు. రైతులకు అవసరమైన సమయంలో సాగునీరు, నిరంతర విద్యుత్తు అందించాలని డిమాండ్ చేశారు. పంటలు నష్టపోయిన రైతులను గుర్తించి తగిన పరిహారం చెల్లించాలని కోరారు. వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేయకుండా రైతుల



సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, పంటలకు నీటి సరఫరా, రైతులకు పరిహారం వంటి అంశాల్లో స్పష్టమైన కార్యాచరణ అవసరమని పేర్కొన్నారు.

కడియం శ్రీహరితోపాటు ఇతర నాయకులు సర్పంచులు, కౌన్సిలర్లను బెదిరించే ప్రయత్నాలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని పల్లా రాజేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక ప్రజాప్రతినిధులు స్వేచ్ఛగా పనిచేసే వాతావరణం ఉండాలని, వారిపై ఒత్తిళ్లు తీసుకురావడం సరికాదని అన్నారు. రానున్న మూడు నెల్లో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రజలే తగిన సమయంలో సమాధానం చెబుతారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా అధికార పార్టీ పాలనపై పలు విమర్శలు చేశారు. జనగామ జిల్లా ఆవిర్భావానికి పదేళ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకాలు నిర్వహించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆధ్వర్యంలో చంపక్ హిల్స్ సమీపంలో, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్య కళాశాల వద్ద, మాజీ మంత్రి డాక్టర్ రాజయ్య ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమీపంలో కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం నెహ్రూ పార్కు నుంచి నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా బయలుదేరి జనగామ చౌరస్తాలో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్నారు. సభలో జిల్లా అభివృద్ధి, రైతుల సమస్యలు, గ్రామీణ ప్రాంతాల పరిస్థితులు, ప్రభుత్వ హామీల అమలు తదితర అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. జనగామ జిల్లా ప్రయోజనాల పరిరక్షణకు, గ్రామాల అభివృద్ధికి తమ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు.

# శంషాబాద్‌లో ఇండిగో విమానం అత్యవసర ల్యాండింగ్

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టినట్లు ప్రాథమిక సమాచారం ద్వారా తెలుస్తోంది. ప్రయాణికుడి వద్ద ఉన్న పవర్ బ్యాంక్‌లో మంటలు రావడంతో విమాన సిబ్బంది వెంటనే స్పందించినట్లు సమాచారం. విమానంలో అగ్నిప్రమాదానికి దారితీసే పరిస్థితులు తలెత్తకుండా సిబ్బంది జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది. విమానంలో మంటలు చెలరేగిన ఘటనలు ప్రయాణికుల భద్రత పరంగా ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తత కీలకంగా మారింది. అయితే ఈ ఘటనలో ఎంతమంది ప్రయాణికులు ఉన్నారు, ఎవరికైనా గాయాలయ్యాయా అనే వివరాలు ఇంకా అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది. విమానాన్ని హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేసినట్లు సమాచారం. విమానం సురక్షితంగా దిగిన అనంతరం ప్రయాణికుల పరిస్థితి, మంటలు చెలరేగిన పవర్ బ్యాంక్‌ను అదుపులోకి తీసుకున్న విధానం వంటి వివరాలపై స్పష్టత రావాల్సి ఉంది. విమానాశ్రయ అధికారులు, విమానయాన సంస్థ నుంచి అధికారిక ప్రకటన వెలువడితేనే ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియనున్నాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా విమానం అత్యవసరంగా ల్యాండ్ అయినట్లు





తెలుస్తోంది. పవర్ బ్యాంక్‌లు, ఇతర లిథియం బ్యాటరీలతో కూడిన పరికరాల్లో లోపాలు తలెత్తినప్పుడు వేడెక్కడం, పొగలు రావడం, మంటలు చెలరేగడం వంటి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంటుంది. విమాన ప్రయాణాల్లో ఇటువంటి పరికరాలను తీసుకెళ్లేట ప్పుడు విమానయాన సంస్థలు సూచించిన భద్రతా నిబంధనలను పాటించడం అవసరం. బ్యాటరీ దెబ్బతిన్నట్లు కనిపించినా, అసాధారణంగా వేడెక్కినా దాన్ని ఉపయోగించకుండా సిబ్బందికి వెంటనే సమాచారం ఇవ్వాలని భద్రతా నిపుణులు సూచిస్తుంటారు. విమానం లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నప్పుడు సిబ్బంది సూచనలను పాటించడం ప్రయాణికుల భద్రతకు కీలకం. శంషాబాద్ విమానాశ్రయంలో ఇండిగో విమానం అత్యవసరంగా ల్యాండ్ అయిన ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. పవర్ బ్యాంక్‌లో మంటలు చెలరేగడానికి గల కారణాలు, విమానంలో ప్రయాణిస్తున్న వారి పరిస్థితి, విమాన సేవలపై పడిన ప్రభావం వంటి అంశాలపై అధికారిక సమాచారం వెలువడాల్సి ఉంది. ప్రస్తుతానికి అందిన సమాచారం ప్రకారం ఢిల్లీ నుంచి చెన్నై వెళ్తున్న విమానం మార్గమధ్యంలో ఈ ఘటనను ఎదుర్కొని హైదరాబాద్‌లో దిగినట్లు తెలుస్తోంది. అధికారిక నిర్ధారణ వచ్చే వరకు ఘటనకు సంబంధించిన వివరాలను ప్రాథమిక సమాచారంగానే పరిగణించాల్సి ఉంటుంది.

# ఆఫ్రికా తీరంలో పడవ బోల్తా 109 మంది మృతి

(మొదటి పేజీ తరువాయి)

మరో 116 మందికి పైగా గల్లంతైనట్లు అంతర్జాతీయ వలసల సంస్థ ఆదివారం వెల్లడించింది. సుమారు 350 మందితో ప్రయాణిస్తున్న పడవ ప్రమాదానికి గురికావడంతో పెద్ద సంఖ్యలో ప్రాణనష్టం సంభవించింది. సముద్రంలో గల్లంతైన వారి కోసం జిబౌటి అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. అక్టోబర్ 8, 9 తేదీల మధ్య రాత్రి సమయంలో వలసదారులతో కూడిన పడవ జిబౌటి నుంచి యెమెన్‌కు బయలుదేరింది. జిబౌటిలోని ఒబాక్ నౌకాశ్రయ పట్టణానికి ఉత్తరాన ఉన్న గుహెరే ప్రాంతానికి సమీపంలోకి చేరుకోగానే పడవ బోల్తా పడినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 109 మృతదేహాలను వెలికితీశారు. మృతుల్లో 52 మంది పురుషులు, 42 మంది మహిళలు, 15 మంది చిన్నారులు ఉన్నట్లు గుర్తించారు. చిన్నారుల్లో తొమ్మిది మంది బాలికలు, ఆరుగురు బాలురు ఉన్నారు. మెరుగైన ఉపాధి, భవిష్యత్తుపై ఆశలతో సముద్ర ప్రయాణం సాగించిన వీరు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం వారి కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగిల్చింది. ప్రమాదం నుంచి 80 మందికి పైగా ప్రాణాలతో బయటపడినట్లు అంతర్జాతీయ వలసల సంస్థ తెలిపింది. వారంతా ఇథియోపియా దేశానికి చెందినవారేనని వెల్లడించింది. వీరిలో 64 మందికి ఒబాక్‌లోని వలసదారుల సహాయ కేంద్రంలో ఆశ్రయం కల్పించి, అవసరమైన సహాయాన్ని అందిస్తున్నట్లు పేర్కొంది. మరోవైపు సముద్రంలో గల్లంతైన వారి ఆచూకీ తెలుసుకునేందుకు జిబౌటి అధికారులు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. బాధితులను గుర్తించడం, ప్రాణాలతో బయటపడిన వారికి అవసరమైన సహాయం అందించడం వంటి చర్యలు కొనసాగుతున్నాయి. అయితే పడవ ఎందుకు బోల్తా పడిందనే విషయంపై ఇప్పటివరకు స్పష్టత రాలేదు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై సంబంధిత అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ఈ ఘటనపై జిబౌటిలోని అంతర్జాతీయ వలసల సంస్థ ప్రతినిధి అలెగ్జాండర్ కోయిసాక్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ స్థాయిలో ప్రాణనష్టం జరగడం హృదయ విదారకమని పేర్కొన్నారు. గల్ఫ్ దేశాలకు చేరుకోవాలనే ఆశతో వేలాది మంది వలసదారులు ఈ సముద్ర మార్గాన్ని ఎంచుకుంటున్నారని, అయితే ప్రయాణంలో ఎదురయ్యే ప్రమాదాలు వారి ప్రాణాలను బలిగొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి అవకాశాలు, మెరుగైన జీవన పరిస్థితుల కోసం స్వదేశాలను విడిచిపెడుతున్నవారు అక్రమ రవాణాదారులపై ఆధారపడటం, ప్రమాదకరమైన పడవల్లో ప్రయాణించడం వంటి కారణాలతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సరైన భద్రతా ఏర్పాట్లు లేకుండా సాగుతున్న ఇటువంటి ప్రయాణాలు వలసదారుల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయని ఈ ఘటన మరోసారి స్పష్టం చేసింది. అంతర్జాతీయ వలసల సంస్థకు చెందిన తప్పిపోయిన వలసదారుల ప్రాజెక్టు గణాంకాల ప్రకారం, 2025లోనే ఈ మార్గంలో 900 మందికి పైగా వలసదారులు మరణించడం లేదా గల్లంతవడం ఆందోళనకరమైన పరిణామం. ఆఫ్రికా నుంచి యెమెన్ మీదుగా గల్ఫ్ ప్రాంతాలకు చేరుకోవాలని ప్రయత్నించే వలసదారులు సముద్ర ప్రయాణంలో అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. పడవల సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించడం, ప్రతికూల సముద్ర పరిస్థితులు, తగిన భద్రతా సదుపాయాలు లేకపోవడం వంటి అంశాలు ప్రమాదాల తీవ్రతను పెంచే అవకాశముంది.

స్పందన
తెలుగు దినపత్రిక

# ఒక్క ఓవరే కొంపముంచిందా?

## రెండో టీ20లో భారత్ ఓటమిపై గవాస్కర్ విశ్లేషణ

- కుల్దీప్ బదులు మయాంక్, అర్ష్‌దీప్‌లలో ఒకరికి బంతి ఇవ్వాల్సిందని వ్యాఖ్య
- 249 పరుగులు చేసినా దక్కని విజయం
- షాయ్ హోప్ శతకంతో వెస్టిండీస్ సంచలనం
- బౌలింగ్ నిర్ణయమే మ్యాచ్‌ను మలుపు తిప్పిందన్న సన్నీ



**రాంచీ, అక్టోబర్** : భారీ స్కోరు సాధించినా విజయం ఎందుకు దక్కలేదు..? 249 పరుగులు చేసిన భారత జట్టు ప్రత్యర్థిని ఎందుకు నిలువరించలేకపోయింది..? రెండో టీ20లో వెస్టిండీస్ చేతిలో టీమిండియా ఓటమికి కారణమైన కీలక నిర్ణయంపై భారత మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. మ్యాచ్‌లో ఒక ఓవర్ ఫలితాన్ని మార్చేసిందని అభిప్రాయపడ్డాడు. ఆ సమయంలో కుల్దీప్ యాదవ్‌కు బదులుగా మయాంక్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్‌లలో ఒకరికి బంతి ఇచ్చి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని పేర్కొన్నాడు. రాంచీ వేదికగా జరిగిన రెండో టీ20లో భారత బ్యాటర్లు చెలరేగడంతో జట్టు 249 పరుగుల భారీ స్కోరు సాధించింది. దీంతో టీమిండియా సునాయాసంగా గెలుస్తుందని భావించినప్పటికీ వెస్టిండీస్ బ్యాటర్లు అద్భుతంగా పోరాడారు. ఆరంభంలో మయాంక్ యాదవ్ మూడు కీలక వికెట్లు తీసి ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టాడు. 36 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టిన అతడు భారత్‌కు ఆశలు కల్పించాడు. అయితే వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ అజేయ శతకంతో మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. 102 పరుగులతో నాటౌట్‌గా నిలిచి తన జట్టును విజయతీరాలకు చేర్చాడు. హోప్‌కు తోడుగా షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ 84 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. వీరిద్దరూ సెంచరీ భాగస్వామ్యంతో భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. రూథర్‌ఫోర్డ్‌ను కుల్దీప్ యాదవ్ అవుట్ చేసినప్పటికీ ఆ తర్వాత అతడికి మరో ఓవర్ ఇవ్వడం మ్యాచ్‌లో కీలక మలుపుగా మారిందని గవాస్కర్ విశ్లేషించాడు. ఆ సమయంలో వేగంగా బౌలింగ్ చేస్తున్న మయాంక్ లేదా అర్ష్‌దీప్‌ను ఉపయోగించి ఉంటే వెస్టిండీస్‌పై ఒత్తిడి కొనసాగించే అవకాశం ఉండేదని అభిప్రాయపడ్డాడు. భారీ స్కోరును కాపాడుకోవడంలో భారత బౌలర్లు విఫలమవడం, కీలక సమయంలో బౌలింగ్ మార్పులు ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడం ఓటమికి కారణాలుగా చర్చకు వచ్చాయి. అయితే కుల్దీప్ వేసిన ఒక్క ఓవరే ఓటమికి కారణమని కాకుండా, ఆ సమయంలో తీసుకున్న బౌలింగ్ నిర్ణయాన్ని గవాస్కర్ ప్రధానంగా ప్రశ్నించాడు. భారీ లక్ష్యాన్ని సైతం వెస్టిండీస్ ఛేదించడంతో భారత జట్టు బౌలింగ్ వ్యూహాలపై చర్చ మొదలైంది. 'భారీ స్కోర్ల మ్యాచ్‌లో టర్నింగ్ పాయింట్.. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ చేసిన పెద్ద పొరపాటు కుల్దీప్‌తో 17వ ఓవర్ వేయించడం. ఆ ఓవర్లో మూడు సిక్సర్లు, ఒక ఫోర్‌తో 24 రన్స్ రావడంతో విండీస్ విజయం తేలికైంది. ఆ ఓవర్ గనుక మయాంక్ యాదవ్ లేదా అర్ష్‌దీప్ సింగ్‌లతో వేయించి ఉంటే ఫలితం మరోలా ఉండేది. ఎందుకంటే.. అప్పటివరకూ మయాంక్ ఎకానమీ ఓవర్‌కు 12 ఉంది. అప్పటికీ విండీస్ విజయానికి మరిన్ని రన్స్ కావాలి. 17వ ఓవర్లో మరో వికెట్ లభించి ఉంటే.. మ్యాచ్ టీమిండియా వైపు తిరిగేది. అంతేకాదు 19వ ఓవర్లో శివం దూబేతో బౌలింగ్ చేయించడం సరైన నిర్ణయం కాదు. విండీస్ బ్యాటర్లు భారీ షాట్లు ఆడుతున్నందున అతడి బదులు ఆ ఓవర్ కుల్దీప్ వేయాల్సింది' అని గవాస్కర్ పేర్కొన్నాడు. రాంచీలో థ్రిల్లింగ్ విక్టరీతో సిరీస్‌ను 1-1తో సమం చేసింది పర్యాటక జట్టు. ఐదు టీ20ల సిరీస్‌లో కీలమైన మూడో మ్యాచ్ అక్టోబర్ 11 ఆదివారం జరుగనుంది.



# గురి అదిరింది.. చోళ చీఫ్స్ బోణీ కొట్టింది!

## కాకతీయ నైట్స్‌పై 6-2 తేడాతో ఘన విజయం

## ఎనిమిది బాణాలతో పది పాయింట్ల గురి కొట్టిన అలెజాండ్రా

**హైదరాబాద్, అక్టోబర్** : ఆర్చరీ ప్రీమియర్ లీగ్ రెండో సీజన్‌లో చోళ చీఫ్స్ జట్టు విజయంతో శుభారంభం చేసింది. పీపుల్స్ ప్లాజా వేదికగా శుక్రవారం జరిగిన పోరులో కాకతీయ నైట్స్‌ను 6-2 తేడాతో ఓడించింది. చోళ చీఫ్స్ విజయంలో కొలంబియా ఆర్చర్ అలెజాండ్రా ఉస్కియానో కీలక పాత్ర పోషించింది. లీగ్‌లో అరంగేట్రం చేసిన ఆమె ఎనిమిది బాణాలను పర్ఫెక్ట్ పది పాయింట్ల లక్ష్యానికి గురిపెట్టి అద్భుత ప్రదర్శన చేసింది. చివరి సెట్‌లో చోళ చీఫ్స్ 80 పాయింట్లు సాధించగా, కాకతీయ నైట్స్ 79 పాయింట్లతో సరిపెట్టుకుంది. మరో మ్యాచ్‌లో చీరో ఆర్చర్స్ 6-2 తేడాతో రాజ్‌పుతానా రాయల్స్‌ను ఓడించింది. పృథ్వీరాజ్ యోధాస్ కూడా 6-2 తేడాతో మైటీ మరాఠాస్‌పై విజయం సాధించింది. శనివారం జరిగే పోటీల్లో మైటీ మరాఠాస్‌తో చోళ చీఫ్స్, పృథ్వీరాజ్ యోధాస్‌తో చీరో ఆర్చర్స్, రాజ్‌పుతానా రాయల్స్‌తో కాకతీయ నైట్స్ తలపడనున్నాయి.

# మ్యాట్ రెన్‌షా సూపర్ సెంచరీ

## డర్బన్ టెస్టులో అద్భుతంగా పుంజుకున్న ఆస్ట్రేలియా!





**డర్బన్, అక్టోబర్** : ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భాగంగా దక్షిణాఫ్రికాతో జరుగుతున్న కీలకమైన డర్బన్ టెస్టు మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు అద్భుతంగా పుంజుకుంది. సఫారీ పేస్ దళం ఉధృతికి తొలిరోజు ఆటలో కేవలం 84 పరుగులకే నాలుగు కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడిన ఆసీస్.. మిడిలార్డర్ బ్యాటర్ మ్యాట్ రెన్‌షా (102 నాటౌట్) అజేయ శతకంతో జట్టును గట్టెక్కించాడు. వివాదాస్పద 'శాండ్‌పేపర్ గేట్' ఘటన తర్వాత దక్షిణాఫ్రికా గడ్డపై తొలి టెస్టు సిరీస్ ఆడుతున్న కంగారూ జట్టు, ఈ మ్యాచ్‌తో పూర్తిగా గాడిలో పడింది. ఓవర్‌నైట్ స్కోర్ 187/6 తో రెండో రోజు ఆటను ప్రారంభించిన ఆస్ట్రేలియాకు కెప్టెన్ ప్యాట్ కమిన్స్ (43) నుంచి అద్భుతమైన సహకారం లభించింది. తొలి రోజు ట్రావిస్ హెడ్ (9), మార్నస్ లబూషేన్ (37), స్టీవెన్ స్మిత్ (25), అలెక్స్ క్యారీ (14) వంటి అనుభవజ్ఞులైన బ్యాటర్లు విఫలమైన చోట, రెన్‌షా క్రీజులో నిలదొక్కుకుని సఫారీ బౌలర్లకు ముచ్చెమటలు పట్టించాడు. కెరీర్‌లో రెండో టెస్టు శతకాన్ని నమోదు చేసిన రెన్‌షా బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. భోజన విరామ సమయానికి ఆస్ట్రేలియా జట్టు 8 వికెట్ల నష్టానికి 277 పరుగులు సాధించి పటిష్ఠ స్థితిలో నిలిచింది. శతక వీరుడు రెన్‌షాకు తోడుగా నాథన్ లియన్ (8 నాటౌట్) క్రీజులో కొనసాగుతున్నాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో వియాన్ మల్డర్ (4/51) నాలుగు వికెట్లతో రాణించాడు.



# వయసు పెరిగినా.. తగ్గని విధ్వంసం!

## 37 బంతుల్లోనే డివిలియర్స్ మెరుపు శతకం

## ఆస్ట్రేలియా ఛాంపియన్స్ బౌలర్లకు చుక్కలు

## మైదానం నలువైపులా షాట్లతో చెలరేగిన మిస్టర్ 360

## క్రికెట్‌కు వీడ్కోలు పలికినా తగ్గని బ్యాటింగ్ జోరు

## ఐపీఎల్‌లోకి తిరిగి రావాలంటున్న అభిమానులు

**న్యూఢిల్లీ, అక్టోబర్** : వయసు పెరిగితే ఆటలో పదును తగ్గుతుందా..? క్రికెట్‌కు వీడ్కోలు పలికితే బ్యాట్ మూగబోతుందా..? దక్షిణాఫ్రికా మాజీ విధ్వంసక బ్యాటర్ ఏబీ డివిలియర్స్ మాత్రం తన ఆటతో ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఒకప్పుడు బౌలర్లకు చుక్కలు చూపించిన మిస్టర్ 360 మరోసారి తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ పోటీల్లో ఆస్ట్రేలియా ఛాంపియన్స్‌పై కేవలం 37 బంతుల్లోనే శతకం బాది అభిమానులను అలరించాడు. మైదానం నలువైపులా బంతులను తరలిస్తూ ఆస్ట్రేలియా బౌలర్లపై విరుచుకుపడ్డాడు. తనదైన వినూత్న షాట్లు, భారీ బాదుడుతో పరుగుల వరద పారించాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికి ఏళ్లు గడుస్తున్నా తన బ్యాటింగ్‌లో పదును ఏమాత్రం తగ్గలేదని చాటిచెప్పాడు. ఒకప్పుడు ప్రపంచంలోని మేటి బౌలర్లను సైతం తన విధ్వంసక ఆటతో ఇబ్బంది పెట్టిన డివిలియర్స్ మరోసారి పాత రోజులను గుర్తుచేశాడు. డివిలియర్స్ మెరుపు శతకంతో అభిమానులు సామాజిక మాధ్యమాల్లో ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇప్పటికీ అదే జోరుతో పరుగులు సాధిస్తున్న అతడు ఐపీఎల్ వేలంలో పేరు నమోదు చేసుకోవాలంటూ కొందరు అభిమానులు కోరుతున్నారు. క్రికెట్‌కు దూరమైనా తనలోని విధ్వంసక బ్యాటర్ ఇంకా సజీవంగానే ఉన్నాడని డివిలియర్స్ ఈ ఇన్నింగ్స్‌తో మరోసారి నిరూపించాడు.

# టీమిండియాతో చరిత్రాత్మక సిరీస్..

## 15 మందితో కూడిన జింబాబ్వే మహిళల జట్టు ప్రకటన!

**హైదరాబాద్, అక్టోబర్** : అంతర్జాతీయ క్రికెట్‌లో సరికొత్త అధ్యాయానికి జింబాబ్వే మహిళల జట్టు సిద్ధమైంది. ఇటీవల వెస్టిండీస్‌పై అద్భుత విజయంతో ఆత్మవిశ్వాసంతో ఉన్న ఆ జట్టు, మొట్టమొదటి ద్వైపాక్షిక సిరీస్ కోసం భారత్‌లో పర్యటించనుంది. ఈ పర్యటనలో భాగంగా అక్టోబర్ 16 నుంచి టీమిండియాతో వైట్‌బాల్ (టీ20, వన్డే) సిరీస్‌లో ఆఫ్రికా జట్టు తలపడనుంది. ఈ నేపథ్యంలో జింబాబ్వే క్రికెట్ బోర్డు శనివారం 15 మందితో కూడిన పటిష్టమైన మహిళల జట్టును ప్రకటించింది. జోసెఫినె కొమో జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. వచ్చే ఏడాది జరగనున్న వన్డే ప్రపంచకప్‌కు సంయుక్త ఆతిథ్య దేశంగా వ్యవహరిస్తున్న జింబాబ్వే జట్టుకు, భారతగడ్డపై భారత్‌తో సిరీస్ ఆడటం ఇదే తొలిసారి కావడం విశేషం. అక్టోబర్ 16న తొలి టీ20తో ఈ పర్యటన ప్రారంభంకానుంది. అక్టోబర్ 18న రెండో టీ20, అక్టోబర్ 20న మూడో టీ20 మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఆ తర్వాత అక్టోబర్ 23 నుంచి 28వ తేదీ వరకు ఇరు జట్ల మధ్య వన్డే సిరీస్ కొనసాగనుంది. మరోవైపు, ఇటీవలే భారత జట్టు టీమ్ కమాండ్ చేపట్టిన స్టార్ ఓపెనర్ స్మృతి మంధానకు, స్వదేశంలో వైట్‌బాల్ కెప్టెన్‌గా ఇదే తొలి ప్రధాన సిరీస్ కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

### జింబాబ్వే మహిళల జట్టు:

జోసెఫినె కొమో (కెప్టెన్), బిలవ్డ్ బిజా, చిపో ముగేరి-తిరిపనో, కెలిస్ ధలోవు, మిచెల్లే మవుంగా, ఫ్రాన్సిస్కా చిపరే, ఒలిండర్ చారే, కడ్జాయి చిగోర, యశా గ్యాంజుర, నొమవెలో సిబండా, లొరిన్ ఫిరీ, చియెడ్జ ధురురు, మొడెస్టర్ ముపచిక్వా, తెండాయ్ మకుషా, ష్రానే మేయర్స్.








# అలియాస్ రుక్మిణీ ఎవరు?

## నితిన్ సినిమాలో బాలీవుడ్ భామ!

## టైటిల్ పాత్రలో ఆఫియా సయ్యద్ అంటూ ప్రచారం

## డిసెంబర్ 4న ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం

**హైదరాబాద్, అక్టోబర్ 10 :** అసలు ఆ రుక్మిణీ ఎవరు..? నితిన్ కొత్త సినిమాలో టైటిల్ పాత్ర పోషించబోయే కథానాయిక ఎవరు..? చిత్రబృందం హీరోయిన్ పేరును రహస్యంగా ఉంచడంతో సినీ అభిమానుల్లో ఆసక్తి పెరుగుతోంది. 'భీష్మ' తర్వాత ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేకపోయిన హీరో నితిన్ ఈసారి 'అలియాస్ రుక్మిణీ' చిత్రంతో విజయాన్ని అందుకోవాలని చూస్తున్నాడు. 'దండోరా' చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న మురళీకాంత్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను నాని నిర్మాణ సంస్థ యూనానిమస్ ప్రొడక్షన్ సమర్పణలో దీప్తి గంటా నిర్మిస్తున్నారు. డిసెంబర్ 4న చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు అక్టోబర్ 9న చిత్రబృందం ప్రకటించింది. అయితే కథానాయిక ఎవరనే విషయాన్ని వెల్లడించకపోవ డంతో రుక్మిణీ పాత్ర చుట్టూ ఆసక్తికరమైన ప్రచా రం మొదలైంది. ఈ చిత్రంలో రుక్మిణీ పాత్రను బాలీవుడ్ నటి ఆఫియా సయ్యద్ పోషించనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ప్రముఖ బాలీవుడ్ నిర్మాత సాజిద్ నడియాద్‌వాలా మేనకో డలిగా చెబుతున్న ఆఫియా ఇటీవల 'ప్రేమ్ కీటాను' చిత్రంతో హిందీ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టింది. మలయాళంలో విజయవంతమైన 'ప్రేమలు' చిత్రానికి రీమేక్‌గా తెరకెక్కిన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. దీంతో ఇప్పుడు తెలుగు చిత్ర పరిశ్రమలో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. మరోవైపు 'అలియాస్ రుక్మిణీ'లో నితిన్ కృష్ణ అనే పాత్రలో కనిపించనున్నాడు. కథానాయిక పాత్రకు కథలో ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందనే ఆసక్తి టైటిల్‌తోనే నెలకొంది. అయితే రుక్మిణీగా ఆఫియా సయ్యద్ నటిస్తున్నారనే ప్రచారంపై చిత్రబృందం ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు. అక్టోబర్ 13న హీరోయిన్ ఎవరనే విషయాన్ని వెల్లడిస్తామని ప్రకటించింది. దీంతో ప్రచారంలో ఉన్నట్లుగా ఆఫియానే రుక్మిణీగా కనిపించనుందా..? లేక చిత్రబృందం మరో కథానాయికను పరిచయం చేయనుందా..? అనే ఉత్కంఠకు మంగళవారం తెరపడనుంది.



# ఒక్కో సినిమాకు రూ.8 కోట్ల పారితోషికమా?

## ప్రచారాలపై శ్రీనిధి శెట్టి క్లారిటీ!

హైదరాబాద్, అక్టోబర్ 10 : సినీ ఇండస్ట్రీలో ఒక భారీ విజయాన్ని అందుకున్న తర్వాత నటీనటుల పారితోషికాలపై రకరకాల ఊహాగానాలు, వార్తలు ప్రచారంలోకి రావడం సహజం. ముఖ్యంగా పాన్-ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న తారల రెమ్యునరేషన్లపై అభిమానుల్లో ఆసక్తి ఎక్కువగా ఉ ంటుంది. ఈ క్రమంలోనే 'కేజీఎఫ్' సినిమాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు సంపాదించుకున్న నటి శ్రీనిధి శెట్టి ఒక్కో సినిమాకు రూ. 7 కోట్ల నుంచి రూ. 8 కోట్ల వరకు పారితోషికం డిమాండ్ చేస్తున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో వార్తలు చక్కర్లు కొట్టాయి. తాజాగా ఈ ప్రచారంపై శ్రీనిధి శెట్టి స్పందిస్తూ పూర్తి స్పష్టత ఇచ్చారు. తన పారితోషికంపై వస్తున్న వార్తలను శ్రీనిధి శెట్టి పూర్తిగా ఖండించారు. ఇప్పటివరకు తాను చేసిన సినిమాల సంఖ్యను పరిశీలిస్తే ఇంత భారీ మె-ఎత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నాననే ప్రచారం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. కేవలం టైమ్‌పాస్ కోసం కొందరు వ్యాప్తి చేసే పుకార్ల ఆధారంగా ఇలాంటి రూమర్లను నమ్మవద్దని ప్రేక్షకులు, అభిమానులకు సూచించారు. సినిమాలను ఎంపిక చేసుకునే క్రమంలో తాను పారితోషికానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వనని, కేవలం డబ్బు సంపాదించడమే తన లక్ష్యమైతే 'కేజీఎఫ్' విజయాన్ని ఆసరాగా చేసుకుని గత కొన్నేళ్లలో 30 నుంచి 40 ప్రాజెక్టులకు అంగీకరించి ఉండేదాన్నని ఆమె తెలిపారు. తన నటనకు ప్రాధాన్యం ఉన్న మంచి కథలు, నాణ్యమైన పాత్రలకే మొదటి ప్రాధాన్యత ఇస్తానని శ్రీనిధి శెట్టి తేల్చిచెప్పారు. సరైన కథ లభిస్తే పారితోషికం విషయంలోనూ చర్చలకు సిద్ధంగా ఉంటానని, ఒక నటిగా ప్రేక్షకుల మనస్సుల్లో చెరగని ముద్ర వేయడమే తనకు ముఖ్యమని స్పష్టం చేశారు. కర్ణాటకలోని మంగళూరుకు చెందిన శ్రీనిధి శెట్టి మోడలింగ్ రంగాన నిలిచి 2016లో 'మిస్ సుప్రానేషనల్' కిరీటాన్ని గెలుచుకున్నారు. ఆ తర్వాత ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో వచ్చిన 'కేజీఎఫ్' ఫ్రాంచైజీతో కథానాయికగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం విక్టరీ వెంకటేష్ ప్రధాన పాత్రలో త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' చిత్రంలో శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్నారు.



# ఇతరుల జీవితాలపై కామెంట్స్ చేయడానికి మీరెవరు?

## ఆన్‌లైన్ ట్రోలింగ్‌పై మృణాల్ ఠాకూర్ ఆగ్రహం!

హైదరాబాద్, అక్టోబర్ 10 : సినీ తారల వ్యక్తిగత జీవితాలు, దుస్తులు మరియు రూపురేఖలను లక్ష్యంగా చేసుకుని సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా పెరిగిపోతున్న ట్రోలింగ్‌పై టాలీవుడ్, బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇటీవల కాలంలో హీరోయిన్లు ఎదుర్కొంటున్న బాడీ షేమింగ్ మరియు ఆన్‌లైన్ విమర్శలను తప్పుబడుతూ, ఇతరుల వ్యక్తిగత ఎంపికలను గౌరవించాలని హితవు పలికారు. తన తాజా చిత్రం 'పూజా మేరీ జాన్' ప్రచార కార్యక్రమంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ అంశంపై ఘాటుగా స్పందించారు. ప్రతి ఒక్కరికీ తమ జీవితాన్ని తమకు నచ్చిన విధంగా జీవించే హక్కు ఉంటుందని, ఎవరో తెర వెనుక కూర్చుని ఇతరుల వ్యక్తిగత నిర్ణయాలను విమర్శించే అధికారం ఎవరికీ లేదని మృణాల్ స్పష్టం చేశారు. కత్రినా కైఫ్, కృతి సనన్ వంటి నటీమణులు సినిమా రంగానికి ఎంతో సేవ చేసి, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. వారి కష్టాన్ని, విజయాలను విస్మరించి కేవలం చిన్న చిన్న విషయాలపై విమర్శలు గుప్పించడం సరికాదని అన్నారు. సోషల్ మీడియాలో కొందరి ప్రవర్తన చూస్తుంటే జనాలకు పిచ్చి పట్టినట్లుగా అనిపిస్తోందని ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇదివరకు ప్రముఖ నటి కత్రినా కైఫ్ ఓ వేడుకలో పాల్గొన్న ఫొటోలపై నెటిజన్లు అనుచిత వ్యాఖ్యలు చేశారు. తల్లి అయిన తర్వాత మహిళల శరీరంలో సహజంగా వచ్చే మార్పులను కూడా కొందరు విమర్శించడంపై సర్వత్రా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. మరోవైపు, నటి కృతి సనన్ కూడా ఓ నగల ప్రకటనలో ధరించిన దుస్తులపై కొందరు నెటిజన్లు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆ యాడ్ వివాదాస్పదమైంది. ఈ నేపథ్యంలో స్పందించిన మృణాల్ ఠాకూర్.. మహిళల శరీరాకృతి, దు-స్తులు మరియు వ్యక్తిగత జీవితాలపై కొద్దిమంది సోషల్ మీడియా వేదికగా నిత్యం అసభ్యకరమైన కామెంట్లు చేయడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ఏ రంగంలోనైనా పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఇలాంటి మానసిక వేధింపులను ఎదుర్కొంటున్నారని, ఇకనైనా ఈ సంస్కృతి మారాలని ఆమె హితవు పలికారు.

Printed, Published, Owned by Md Nazeer Ahmed, Published from 5-8-124/231, Narayana Reddy colony, Sangareddy, Telangana 502001 Printed At Saketh Printers SY. No. 212, Trinetra Complex, Veerabadra Nagar, Sangareddy, Telangana 502001,RNI NO TGTEL26/A6780